సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



చంద్రయాన్‌-3లో మనోళ్లు

చంద్రయాన్‌-3 విజయంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన పలువురు భాగస్వాములయ్యారు. IIలో



విస్తారంగా వర్షాలు..

మన్యంలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. IIలో



బ్రేకులు ఫెయిలై ఆటో బోల్తా

సాగుల ఘాట్‌ రోడ్డులో బ్రేకులు ఫెయిలై ఆటో బోల్తా పడింది. నలుగురికి తీవ్రంగా, ఆరుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. IIలో

న్యూస్‌రీల్‌

పోశమ్మగుడి వద్ద వరద తగ్గుముఖం

దేవీపట్నం: మండలంలోని పూడిపల్లి పంచాయతీలో గండిపోశమ్మ ఆలయం వద్ద వరద తగ్గుముఖం పట్టింది. ఇటీవల నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు పోటెత్తి ఆలయాన్ని ముంచెత్తింది. వారం రోజుల క్రితం ఆలయంలో నీరు తొలగిపోయింది. అయితే పోలవరం ప్రాజెక్టు కాఫర్‌ డ్యామ్‌ నిర్మాణంతో గోదావరి బ్యాక్‌ వాటర్‌ పోటెత్తడంతో ఆలయం నీట మునిగింది. బుధవారం నుంచి తగ్గుముఖం పట్టడంతో సుమారు నాలుగు అడుగుల మేర వరద తగ్గింది.

సరకుల సరఫరాకు టెండర్ల ఖరారు



టెండర్లు ఖరారు చేస్తున్న డీడీ

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం ఇచ్చేందుకు నాణ్యమైన సరకులు అందజేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ జాన్‌రాజ్‌ తెలిపారు. ఆశ్రమ పాఠశాలలకు సరకుల పంపిణీకి సంబంధించి తక్కువ ధరకు వేసిన టెండర్లను గురువారం ఆయన పరిశీలించి ఖరారు చేశారు. పీవో సూరజ్‌ గనోరే ఆదేశాల మేరకు చింతూరు, రంపచోడవరం డివిజన్‌ పరిధిలో 11 మండలాలకు సంబంధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర సరకులు సరఫరా చేయుటకు ఐదుగురు టెండర్లు వేశారు. ఏటీడబ్ల్యూవోలు తదితరులు పాల్గొన్నారు.

'అర్పిత' ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు


సాక్షి, అమరావతి: డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ జయంతిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నట్టు విశాఖపట్నంకు చెందిన అర్పిత సాంస్కృతిక సేవా సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్‌ గణగళ్ల విజయ్‌ కుమార్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో ఉండి బోధన, బోధనేతర రంగాల్లో విశేష కృషి చేస్తున్నవారిని 22 ఏళ్లుగా సత్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులకు సెప్టెంబర్‌ 11న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించే వేడుకల్లో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తమ దరఖాస్తులను ఈనెల 31 లోగా 9391379903 వాట్సాప్‌ నంబర్‌కు పంపాలని కోరారు.

రాజభాష అమలులో వాల్తేర్‌ డివిజన్‌ భేష్‌

- పార్లమెంట్‌ సబ్‌ కమిటీ ప్రశంస

తాటిచెట్లపాలెం: రాజభాష అమలులో వాల్తేర్‌ డివిజన్‌ ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని పార్లమెంటరీ అధికారిక భాషా కమిటీకి చెందిన 2వ సబ్‌ కమిటీ ప్రశంసించింది. డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ కార్యాలయంలో బుధవారం కమిటీ ప్రతినిధులు పర్యటించి.. అధికార భాష అమలు తీరును పరిశీలించారు. అధికారిక కార్యకలాపాలు, ఇతర విభాగాల్లో రాజభాష ప్రయోగాన్ని వీరు ప్రత్యక్షంగా పరీక్షించారు. ఇప్పటివరకు అధికారిక భాషపై శిక్షణ పొందని సిబ్బందిని గుర్తించి.. శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. తరచుగా సిబ్బందికి హిందీపై వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, స్థానిక భాషలతోపాటు హిందీలో కూడా ప్రకటనలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అధికారిక భాష అమలులో వాల్తేర్‌ డివిజన్‌ అనుసరిస్తున్న పద్ధతులను అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్‌ ప్రసాద్‌కు కమిటీ కన్వీనర్‌ రంజన్‌ బెన్‌ భట్‌ ప్రశంసాపత్రం అందించారు. ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్‌) మనోజ్‌కుమార్‌ సాహూ ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే రాజభాషా అధికారి ఎల్లీన పండా, వాల్తేర్‌ డివిజన్‌ రాజభాష ఇన్‌చార్జి ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మాజీ క్రికెటర్లు



అప్పన్న సన్నిధిలో మాజీ క్రికెటర్లు హేమంగ్‌ బదానీ, అమోల్‌ ముజుందార్‌

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామిని గురువారం భారత మాజీ క్రికెటర్లు హేమంగ్‌ బదానీ, అమోల్‌ ముజుందార్‌ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని అధికారులు వారికి అందించారు. రాష్ట్ర మాజీ క్రికెటర్‌ రాఘవ, వ్యాఖ్యాత రమన్‌ వారి వెంట ఉన్నారు.

ఆనంద 'లోగేలి'

లోగేలి బ్రిడ్జి ప్రారంభానికి సిద్ధమైంది. దీనిపై ఆధారపడ్డ 50 గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తొలగనున్నాయి. ఇకనుంచి వర్షాకాలంలోనూ మైదాన ప్రాంతాలకు పంట ఉత్పత్తులు సులభంగా తరలించవచ్చు. హుద్‌హుద్‌ తుఫాన్‌కు కొట్టుకుపోయిన ఈ బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మించాలని వేడుకున్నా, గత టీడీపీ పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. తాజాగా వైఎస్సార్‌సీపీ హయాంలో అందుబాటులోకి రావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.1.80 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం
- 50 గ్రామాలకు తొలగిన రవాణా కష్టాలు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో పూర్తి
- త్వరలో ప్రారంభం



నూతనంగా నిర్మించిన బ్రిడ్జి

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ లోగేలి గ్రామ సమీపంలో రూ.180.00 లక్షలతో నిర్మించిన బ్రిడ్జి ప్రారంభానికి సిద్ధమైంది. ఇక్కడ 2012లో రూ.28 లక్షలతో బ్రిడ్జి నిర్మించారు. ఇది 2014లో సంభవించిన హుద్‌హుద్‌ తుఫాన్‌ కారణంగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజలు బ్రిడ్జి నిర్మించాలని సంబంధిత అధికారులకు, అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేలకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. అప్పట్లో ప్రతి ప్రక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకురావడంతో 2019లో మన ప్రభుత్వం అధికారంలో రాగానే బ్రిడ్జి నిర్మాణం చేస్తామని మాట ఇచ్చారు. ఆ తర్వాత అరకు ఎమ్మెల్యేగా ఆయన గెలిచిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.180.00 లక్షలు మంజూరు చేయించారు.

వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు

బ్రిడ్జి కూలిపోయిన తర్వాత ఏటా వర్షాకాలంలో జనజీవనం స్తంభించేది. కనీసం గిరిజన రైతులు పడించిన పంట ఉత్పత్తులను వారపు సంతలకు తరలించి విక్రయించేందుకు అవకాశం లేకుండా పోయేది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. గతంలో అనేకమార్లు టీడీపీ నాయకులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బ్రిడ్జి నిర్మించడంతో ఎట్టకేలకు తమ కష్టాలు తొలగిపోయాయని, 50 గ్రామాల గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మా కష్టాలు తీరాయి



గతంలో బ్రిడ్జి లేకపోవడంతో వర్షకాలంలో అనేక ఇబ్బందులు పడేవారు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు అవకాశం లేకపోయేది. వర్షం తగ్గితేనే బయటకు వచ్చేవారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో బ్రిడ్జి నిర్మించడం ఎంతో సంతోషంగా ఉంది. మా కష్టాలు తీరాయి.

– మహదేవ్‌, గసభ పంచాయతీ, ఉప సర్పంచ్‌

అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం..



వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన వెంటనే మారుమూల గిరిజన ప్రాంతాల్లో బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఈ పనులు పూర్తి చేయడమే మా లక్ష్యం. రూ.180.00 లక్షలతో లోగేలి బ్రిడ్జి నిర్మించాం. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు పూర్తి చేశాం.

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు

అక్టోబర్‌లోగా భవన నిర్మాణాలు పూర్తి

- పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌ లిస్ట్‌లో పెడతాం
- అరకు నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఐటీడీఏ పీవో అభిషేక్‌ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్‌

పాడేరు రూరల్‌: పాడేరు ఐటీడీఏ పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని పీవో అభిషేక్‌ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ రాజ్‌ ఇంజినీరింగ్‌ అధికారులతో సమావేశమయ్యారు. అరకు నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ భవన నిర్మాణాలను ప్రాధాన్యేతర పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు అప్పగించి సెప్టెంబర్‌ నెలాఖరుకు కొన్ని, అక్టోబర్‌ నెలాఖరుకు మిగిలినవి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నిర్మాణాలు చేయటానికి బయానాలు తీసుకుని ముందుకు రాని కాంట్రాక్టర్లకు పనుల బిల్లులను నిలుపుదల చేయాలన్నారు. పనులు చేసిన వాటికి సకాలంలో బిల్లులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ప్రాధాన్యత పనులు చేపడుతూ మధ్యలో నిలుపుదల చేసే కాంట్రాక్టర్లను బ్లాక్‌ లిస్ట్‌లో పెడతామన్నారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన నిర్మాణాలకు బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించామన్నారు. ఇంజినీరింగ్‌ అధికారులు ప్రాధాన్యత భవన నిర్మాణాల పనులను పర్యవేక్షించాలన్నారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్‌ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ రాజ్‌ ఈఈ కొండయ్య పడాల్‌, పి.ఐ.యు. ఈఈ లావణ్యకుమార్‌, డీఈ రామం, ఏఈలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 100 కుటుంబాలు చేరిక



పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

అడ్డతీగల: రంపచోడవరం మండలానికి చెందిన టీడీపీతోపాటు సాయి దుర్గా ఎలక్ట్రికల్‌ ప్లంబర్‌ యూనియన్‌ నుంచి వంద కుటుంబాల వారు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. అడ్డతీగల మండలం ఎల్లవరంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ ప్రజల పక్షాన నిరంతరం పని చేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మెచ్చి రోజు రోజురోజుకీ ప్రజాదరణ పెరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్‌సీపీ రంపచోడవరం మండల కన్వీనర్‌ జల్లేపల్లి రామన్నదొర, పార్టీ నాయకుడు పండా రామకృష్ణ పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలు

రైతులకు పంపిణీ చేసిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రైతులకు రాజ్‌మా విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీపై గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలు అందిస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. అరకులోయ రైతు భరోసా కేంద్రంలో వీటిని పంపిణీని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1,984 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తొలి రోజు అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల రైతులకు 1,365 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. గత టీడీపీ పాలనలో ఏనాడూ రైతులకు సకాలంలో విత్తనాలు అందజేయలేదన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, వైస్‌ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు పాడి రమేష్‌, ఎంపీటీసీ సభ్యులు భీమరాజు, ఆనంద్‌కుమార్‌, ఏడీఏ మోహన్‌రావు, ఏవోలు శ్రీనివాసరావు, నీలవేణి, లీలావతి, నాయకులు రంజిత్‌కుమార్‌, నర్సింగ్‌, సోమేష్‌, బాలరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా కర్రల వ్యూ పాయింట్‌



అరకు-విశాఖ మార్గంలో భీసుపురం గిరిజనులు స్వచ్ఛందంగా నిర్మించుకున్న వ్యూ పాయింట్‌



వ్యాపారం నిమిత్తం పాకలను ఏర్పాటు చేసుకున్న గిరిజనులు

ఫిదా అవుతున్న పర్యాటకులు

అనంతగిరి: మన్యంలోని అందాలకు కొదువ లేదు. ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన అందాలు ఎంతోమంది పర్యాటకుల హృదయాలను దోచుకుంటున్నాయి. దాంతో వీటిని తిలకించేందుకు ఘాట్‌రోడ్డు మార్గం గుండా పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. గతంలోనే అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని డముకు వద్ద, గాలికొండ వద్ద వ్యూ పాయింట్లు నిర్మించారు. వీటిపై నుంచి ప్రకృతి అందాలను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. అయితే రెండు వ్యూ పాయింట్‌లు సిమెంట్‌ కాంక్రీట్‌తో కట్టినవి. దీంతో వినూత్నంగా ఆలోచించిన భీసుపురం గ్రామ గిరిజనులు పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడేలా.. స్థానికంగా దొరికే కర్రలతో ఓ చెట్టును ఆనుకుని వ్యూ పాయింట్‌ నిర్మించారు. ఆ ప్రదేశాన్ని పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేసుకుని 20 కుటుంబాల వారు స్వయం ఉపాధి పొందేందుకు సిద్ధమవుతున్నారు. వ్యూ పాయింట్‌ ఆనుకుని ఎదురుగా ఉండే కొండలు, కాఫీ తోటలు, లోయలో పారుతున్న గెడ్డ, పరవశించే ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా అవ్వాల్సిందేనని చెబుతున్నారు.

40 మందితో జిల్లా నూతన కార్యవర్గం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కొనసాగింపు



సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నూతన కార్యవర్గాన్ని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని కొనసాగిస్తూనే.. మరో 39 మంది సీనియర్‌ నేతలకు, కార్యకర్తలకు నూతన కార్యవర్గంలో చోటు కల్పించింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా అరకులోయ నియోజకవర్గానికి చెందిన పి.సింహాచలం, రంపచోడవరానికి చెందిన కందుల బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శులుగా కట్టా సత్యనారాయణ (రంపచోడవరం), సల్లంగి ఉమామహేశ్వరరావు (అరకులోయ), సీదరి మంగ్లన్నదొర (పాడేరు), ఎ.జగబంధు(అరకులోయ), కోశాధికారిగా నక్కా వీర్రాజు (రంపచోడవరం), కార్యదర్శులుగా పాడేరు నియోజకవర్గానికి చెందిన కంకిపాటి గిరిప్రసాద్‌, పాంగి గణబాబు, గాడి సత్యనారాయణ, అరకులోయ నియోజకవర్గానికి చెందిన జి.గోపాలరావు, ఎస్‌.వెంకటరావు, పి.కొండలరావు, రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన దాట్ల వెంకటేశ్వరరాజు, దామెర్ల రేవతి, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా పాడేరు నియోజకవర్గానికి చెందిన పాంగి అంద్రయ్య, సిరగం దశమూర్తి, నీలపు సూరిబాబు, పాంగి రామకృష్ణుడు, కురుసా తిరుపతి, రీమలి గంగాధర్‌, లంకేల కల్యాణ్‌, రెడ్డి మోహన్‌రావు, వసుపరి ప్రసాద్‌, రీమల బాలకృష్ణ, రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన గుడ్ల త్రిమూర్తులు, కరక లక్ష్మి, బొడ్డు సత్యనారాయణ, సారపు పావని, చీడిపల్లి శాంతికుమారి, అరకులోయ నియోజకవర్గానికి చెందిన జి.కొండబాబు, ఎస్‌.ధర్మయ్యదొర, జి.దొన్ను, కొర్రా గాసీ, జర్సింగి గంగాభవానీ, మండి లక్ష్మి, బురిడి లీలారాణి, గెమ్మెలి పుష్పలత, సోమెలి శ్రావణి నియమితులయ్యారు.

రూ.3.53 కోట్ల ద్వైవార్షిక నగదు జమ

కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌



మహిళలకు రూ.3.53 లక్షల నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌

సాక్షి, పాడేరు: జిల్లాలోని వివిధ పథకాల కింద అర్హులైన 3,066 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 53 లక్షల 19 వేల ద్వైవార్షిక నగదును వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ తెలిపారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వెలగపూడిలోని తన కార్యాలయం నుంచి నవరత్నాలు ద్వైవార్షిక నగదును బటన్‌ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్‌, ఇతర అధికారులు, లబ్ధిదారులంతా వీక్షించారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో అమ్మఒడి పథకం కింద 378 మంది లబ్ధిదారులకు రూ.56 లక్షల 70 వేలు, చేదోడు పథకంలో 592 మందికి రూ.59 లక్షల 20 వేలు, ఈబీసీ నేస్తంలో 13 మందికి రూ.లక్ష 95 వేలు, జగనన్న విద్యా దీవెన పథకంలో 625 మందికి రూ.58 లక్షల 65 వేల 398, జగనన్న వసతి దీవెనలో 783 మందికి రూ.84 లక్షల 60 వేల 600, రైతు భరోసాలో 15 మందికి రూ.58 వేలు, వైఎస్సార్‌ క్రాంతి పథం ఆసరా కింద 660 స్వయం సంఘాలకు రూ.91 లక్షల 49 వేల 960లను లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం జమ చేశారన్నారు.

ప్రభుత్వం అమలుజేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నమూనా చెక్కును కలెక్టర్‌ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, అన్ని మండలాల ఏపీఎంలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌, డాక్టర్‌ విశ్వేశ్వరనాయుడు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు జరిగే జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ వైద్య బృందాలను ఆదేశించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ రూపొందించిన నేత్రదాన పక్షోత్సవాల ప్రచార పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేత్రదానం ఆవశ్యకతపై గ్రామాల్లో ర్యాలీలు, సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. మరణానంతరం నేత్రదానంపై ఆసక్తి ఉన్న వారు ప్రతిజ్ఞా పత్రంపై సంతకం చేసి, జిల్లా అంధత్వ నివారణ కార్యాలయానికి అందజేయాలన్నారు. మోహిసిస్‌ ఐ బ్యాంక్‌, 924662400 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ విభాగం ప్రోగ్రాం మేనేజర్‌ డాక్టర్‌ తమర్బ విశ్వేశ్వరనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంలోనూ మార్కెట్ల సందడి

మహిళలకు అత్యంత పవిత్రమైనది శ్రావణమాసం. ఈ మాసంలో పూర్ణిమ ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తే అష్టైశ్వర్యాలు, అష్టలక్ష్మిని పూజించిన ఫలం కలుగుతుందని నమ్మకం. ఈ నేపథ్యంలో మార్కెట్లకు శ్రావణ శోభ నెలకొంది. పూజా సామగ్రి, బంగారు కాసుల కొనుగోళ్లతో సందడిగా మారింది.

- పూజా సామగ్రి కొనుగోళ్ల జోరు
- మహిళలతో కిటకిటలాడిన దుకాణాలు



వర్షంలోను పాడేరు మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



పాడేరు మార్కెట్‌లో పలు రకాల పండ్లను కొనుగోలు చేస్తున్న మహిళలు



పాడేరు బంగారు దుకాణంలో కాసుల కొనుగోళ్లలో మహిళలు



వరలక్ష్మి రూపంతో కూడిన బంగారు కాసులు

సాక్షి, పాడేరు: పవిత్ర శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతంతో గురువారం మధ్యాహ్నం నుంచే జిల్లా కేంద్రం పాడేరుతోపాటు, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ మార్కెట్లో సందడి నెలకొంది. మహిళలు శ్రావణ మాసంలోని వరలక్ష్మీ వ్రతాన్ని తమ శక్తికొద్దీ ఘనంగా నిర్వహించుకునే ఆచారం ఉంది. పూజా కార్యక్రమాల నేపథ్యంలో పాడేరు, అరకులోయ, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు, మారేడుమిల్లి, రాజవొమ్మంగి వంటి ప్రధాన కేంద్రాలతోపాటు పలు మండలాల్లోను పూజా సామగ్రి, పూలు, పండ్ల దుకాణాలు వెలిశాయి. మధ్యాహ్నం నుంచే పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రి అమ్మకాలు భారీగా జరిగాయి. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెద బయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన మహిళలు భారీగానే పాడేరుకు చేరుకుని అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు. జిల్లా కేంద్రం పాడేరులో వర్షం కురుస్తున్నప్పటికీ మహిళలు గొడుగులను ఆశ్రయించి హుషారుగా మార్కెట్‌కు తరలివచ్చారు.

అధికంగానే ధరలు..

పలు రకాల పూలకు మాత్రం ధరలు అధికంగానే ఉన్నాయి. చామంతి, బంతిపూలు, దాలియా పూలను అధిక ధరతోనే వ్యాపారులు అమ్మకాలు చేశారు. వరలక్ష్మి పూజకు అధికంగా ఉపయోగించే అన్ని రకాల పండ్ల ధరలను పెంచి మరి విక్రయించారు. పెద్ద సైజు యాపిల్‌ రూ.20 నుంచి రూ.30తో అమ్మకాలు చేపట్టారు. పూలు, పండ్ల ధరలు అధికంగా ఉన్నప్పటికి మహిళలు మాత్రం వాటిని కొనుగోలు చేసుకున్నారు.

బంగారు దుకాణాల రద్దీ..

శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతంతో బంగారు దుకాణాలు రద్దీగానే మారాయి. పాడేరు, అరకులోయలో రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలికే పలు సైజులను బంగారు కాసులను జ్యూవెలరీ షాపుల్లో అందుబాటులో ఉంచారు. వరలక్ష్మీ తల్లి ప్రతిమతో కూడిన బంగారు కాసులను మహిళలు భారీగా కొనుగోలు చేసుకున్నారు.

క్లుప్తంగా

కేజీబీవీలో చంద్రయాన్‌-3 విజయోత్సవం



కేజీబీవీలో విద్యార్థినులతో ఆనందం పంచుకుంటున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: చంద్రయాన్‌–3 ప్రయోగం విజయవంతం కావడంతో సంతోషంగా ఉందని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. గురువారం కొత్తూరు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రయాన్‌–2 విఫలమైనప్పటికీ పట్టు విడవకుండా శాస్త్రవేత్తలు చేసిన కృషితో నేడు చంద్రయాన్‌–3 విజయవంతమైందని ఆమె తెలిపారు. ఎస్‌వో లతా, ఉపాధ్యాయినులు మాధవి, ప్రమీల రమాదేవి, సుబ్బలక్ష్మి, భారతి, సర్పంచ్‌ సీతయ్య పాల్గొన్నారు.

పాము కాటుకు మహిళ మృతి



సన్యాసమ్మ మృతదేహం

కొయ్యూరు: మండలంలోని ఎం.భీమవరం పంచాయతీ పెదలంక కొత్తూరుకు చెందిన కాకూరి సన్యాసమ్మ (45)ను గురువారం ఉదయం పాము కాటు వేయడంతో మృతి చెందింది. ఆమె ఇంటి వద్ద నేలపై నిద్రిస్తుండగా పాటు కాటేసింది. ఈ విషయం బంధువులకు చెప్పగానే వారంతా వై. రామవరం ఆస్పత్రికి తీసుకొస్తుండగా, పుట్టకోట దాటిన తర్వాత మరణించింది. దీంతో మృతదేహాన్ని వెనక్కి తీసుకొచ్చారు.

యువకుడి ఆత్మహత్య

మద్రిపాలెం: ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటన విశాఖపట్నం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాడేరుకు చెందిన కృష్ణారావు(25) అనే యువకుడు కంచరపాలెం అరుంధతినగర్‌లోని తన బంధువుల ఇంట్లో నివసిస్తున్నాడు. నగరంలోని సిరిపురంలో గల ఓ వస్త్రాల దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి తల్లిదండ్రులు పాడేరులో నివసిస్తున్నారు. మృతుడి బంధువు కె.భాగ్యవతి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్‌.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణారావు మృతదేహాన్ని కేజీహెచ్‌ మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం జరుగుతుందని పోలీసులు తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిస్థాయి దర్యాప్తులో తెలియాల్సి ఉందని చెప్పారు.

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి కౌన్సెలింగ్‌

మహారాణిపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌, పోస్టింగ్‌ ప్రక్రియకు గురువారం శ్రీకారం చుట్టారు. రీజినల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌.ఉమాసుందరి పర్యవేక్షణలో మల్టీ పర్పస్‌ హెల్త్‌ సూపర్‌ వైజర్‌, సీనియర్‌, జూనియర్‌ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు.

చంద్రయాన్‌-3లో మనోళ్లు

- భరద్వాజ్‌, ఎర్నికుమార్‌లకు జేజేలు
- తమ ఊరి యువకుల ప్రతిభకు మురిసిపోతున్న గవరవరం, సూరెడ్డిపాలెం



భరద్వాజ్‌, రాళ్లపల్లి ఎర్నికుమార్‌



చంద్రయాన్‌ విజయంలో కృషి చేసిన శాస్త్రవేత్తలకు సెల్యూట్‌ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చోడవరం రూరల్‌: చంద్రయాన్‌–3 విజయం ద్వారా భారత్‌ ఖ్యాతి ఖండాంతరాలలో వ్యాపించగా.. ఆ విజయంలో అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన మనోళ్లు భాగస్వాములయ్యారు. తమ ఊరి శాస్త్రవేత్తలు భరద్వాజ్‌, ఎర్నికుమార్‌ తమ గ్రామాలకే గౌరవం తెచ్చారంటూ గవరవరం, సూరెడ్డిపాలెం గ్రామాలు మురిసిపోయాయి. గ్రామంలో సత్యం పంతులుగా పేరున్న కొమ్మనమంచి సత్యం మనుమడు భరద్వాజ్‌ శ్రీహరికోట రాకెట్‌ ప్రయోగ కేంద్రంలో 2021 నుంచి గ్రేడ్‌ సి శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్‌–3 ప్రయోగంలో తన వంతు భూమికను పోషించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు చంద్రయాన్‌ సాఫ్ట్‌ ల్యాండింగ్‌తో రాకెట్‌ ప్రయోగాల చర్చలతో భరద్వాజ్‌ ఒక్కసారిగా ఊరివారందరికీ గుర్తులోకొచ్చారు. అంతటి గొప్ప విజయంలో తమ గ్రామానికి చెందిన యువశాస్త్రవేత్త భాగస్వామి కావడం తమ ఊరికే గర్వకారణమన్న గ్రామస్తుల మెచ్చుకోలు, అభినందనలతో ఆయన తాతయ్య సత్యం పంతులు సంతోషంలో మునిగితేలారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత్‌కు, భరద్వాజ్‌కు జేజేలు పలికారు. హైస్కూలు విద్యను చోడవరంలోని ప్రైవేటు పాఠశాలలో పూర్తి చేసిన భరద్వాజ్‌.. కళాశాల విద్యను విశాఖపట్నంలో పూర్తి చేశారు. ఆయన తండ్రి కె.వెంకటరావు విశాఖలోని జిందాల్‌ కంపెనీలో చేస్తున్నారు.

ఎర్నికుమార్‌కు జేజేలు

సబ్బవరం : చంద్రయాన్‌–3 విజయంలో మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాళ్లపల్లి ఎర్నికుమార్‌ కీలకపాత్ర వహించారు. శ్రీహరికోటలో రాకెట్‌ లాంచింగ్‌ విభాగంలో ఇంజినీర్‌గా సేవలు అందించారు. ఈ మిషన్‌లో ప్రస్తుత విభాగంలో 2018 నుంచి పనిచేస్తున్నారు. తండ్రి రాళ్లపల్లి వెంకట రమణ పోర్టులో ఉద్యోగిగా పనిచేస్తూ ఇటీవల రిటైరయ్యారు. తల్లి బంగారుతల్లి గృహిణి. ప్రస్తుతం ఎర్నికుమార్‌ భార్య ఝాన్సీతో కలిసి శ్రీహరి కోటలో నివాసం ఉంటున్నారు. ఎర్నికుమార్‌ సబ్బవరంలో మదర్‌ పబ్లిక్‌ స్కూల్‌ 2007–08లో పదో తరగతి చదివారు. ఆ పాఠశాల విద్యార్థులతో పాటు స్వగ్రామం సూరెడ్డిపాలెం గ్రామస్తులు ఎర్నికుమార్‌కు జేజేలు పలికారు.

ఇస్రోకు విద్యార్థుల వందనం

కె.కోటపాడు/చోడవరం రూరల్‌/నక్కపల్లి : చంద్రయాన్‌–3 ప్రయోగం విజయవంతంతో కె.కోటపాడు, చోడవరం, నక్కపల్లి మండలాల్లోని పాఠశాలల్లో ఒక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

ఇక గగన్‌యాన్‌ కోసం శ్రమిస్తాం..

చంద్రయాన్‌–3 విజయవంతంగా చంద్రునిపై సాఫ్ట్‌ ల్యాండింగ్‌ కావడం మమ్మల్ని ఎంతో ఉద్వేగానికి, ఉత్తేజానికి, సంతోషానికి గురి చేసింది. త్వరలో గగన్‌యాన్‌ ప్రాజెక్టు కూడా ఇలాంటి విజయాన్నే నమోదు చేయాలని ఆకాంక్షిస్తున్నాను. చంద్రయాన్‌–2 ప్రయోగించే నాటికి నేను ఇంకా విద్యార్థినే. శాస్త్రవేత్తగా చేరిన కొద్ది కాలంలోనే చంద్రయాన్‌–3 ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వంగా ఉంది. మా బృందం శ్రీహరికోటలో చంద్రయాన్‌ ప్రయోగ రాకెట్‌ను నిలిపిన దగ్గర నుంచి కౌంట్‌డౌన్‌ పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియలో పాలుపంచుకుంది. అంతరిక్ష ప్రయోగాల పట్ల గల మక్కువతో ఇంటర్మీడియట్‌ అనంతరం జేఈఈ మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించి ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ స్పేస్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ)లో సీటు సాధించాను. అదే నన్ను ఇస్రోలో శాస్త్రవేత్తను చేసింది.

– భరద్వాజ్‌, ఇస్రో శాస్త్రవేత్త

అర్హులైన వారు ఓటు హక్కు పొందాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు



మాట్లాడుతున్న కాశీ విశ్వనాథరాజు

పాడేరు రూరల్‌: అర్హులైన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు సూచించారు. గురువారం పాడేరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఓటరు చేతన అభియాన్‌ కమిటీ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిజమైన ఓటరు తొలగింపు ప్రక్రియతోపాటు బోగస్‌ ఓట్ల నమోదును బీజేపీ శ్రేణులు అడ్డుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే ఓటరు చేతన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పది వేల కొత్త ఓట్లు నమోదు చేసేందుకు అన్ని చోట్ల కృషి చేయాలన్నారు. తప్పుడు సమాచారంతో ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ చేపడితే సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఇటీవల రెండోసారి గిరిజన మోర్చా అధ్యక్షుడిగా ఎన్నికైన కురుసా ఉమామహేశ్వరరావును దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ అరకు పార్లమెంట్‌ జిల్లా ఇన్‌చార్జి పరశురామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు సల్లా రామకృష్ణ, రాఘవేంద్రరావు, పాడేరు అసెంబ్లీ కన్వీనర్‌ కూడా కృష్ణారావు, అరకు అసెంబ్లీ కన్వీనర్‌ బిసాయి ధర్మరాజు, బీజేవైఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యజమానిని హత్య చేసిన వాచ్‌మన్‌కు జీవిత ఖైదు

విశాఖ లీగల్‌ : అపార్టుమెంటు యజమానిని అతి కిరాతకంగా హత్య చేసిన కాపలాదారునికి జీవిత ఖైదు విధిస్తూ నగరంలోని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీహరి గురువారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ బర్కత్‌ ఆలీ ఖాన్‌ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు బంగారు నాయుడు అక్కయ్యపాలెం నందగిరి నగర్‌ దగ్గర్లోని ఒక అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా పని చేసేవాడు. అదే అపార్టుమెంటులో మొదటి అంతస్తులో కప్పల ప్రకాష్‌ దాస్‌ ఉండేవాడు. దాస్‌ జాతకాలు చెబుతూ ఒక్కడే ఉండేవాడు. ప్రకాష్‌ రాజ్‌ కుమారుడు అశోక్‌ కుమార్‌ ఉద్యోగ రీత్యా గాజువాకలో నివాముంటున్నాడు. 2013 ఆగస్టు 19వ తేదీన సాయంత్రం అశోక్‌ తన తండ్రికి ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. రాత్రి 11 గంటల వరకు ఫోన్‌ చేసినా ప్రయోజనం లేకపోయింది. అనుమానంతో నందగిరి నగర్‌కు వచ్చిన ఇంటితోపాటు చుట్టుపక్కల గాలించారు. ప్రయోజనం లేకపోయింది. ఇంట్లో బంగారు వస్తువులు కనిపించలేదు. ఆగస్టు 20వ తేదీన అపార్ట్‌మెంట్‌ సమీపంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడని స్థానికులు గుర్తించారు. ఈ సమాచారం అందుకున్న నాలుగో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చూసిన అశోక్‌ తన తండ్రిదిగా గుర్తుపట్టారు. వెంటనే పోలీసులు జాగిలాలను రంగంలోకి దించారు. ప్రకాష్‌ దాస్‌ ఉంటున్న ఇంట్లో రక్తపు మరకలు ఉన్నట్లు కుక్కలు గుర్తించాయి. వాచ్‌మన్‌ బంగారు నాయుడు ఇంట్లో వరకు వెళ్లాయి. పోలీసు పరీక్షల్లో అవి ప్రకాష్‌దాస్‌వి అని నిర్ధారణ అయింది. నాటి ఫోర్త్‌ టౌన్‌ సీఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో బంగారు నాయుడుకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గంజాయి అనర్థాలపై కళాజాత



మద్దిగరువులో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

జి.మాడుగుల: మండలంలో మద్దిగరువు గ్రామంలో గురువారం జరిగిన వారపు సంతలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ×గంజాయి పంట వద్దు–ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి÷ గంజాయి పంట నిషేధంపై కళాజాత కార్యక్రమం గురువారం జరిగింది. గంజాయి పంట వద్దు ప్రత్యామ్నాయ పంటలే ముద్దు అని కళాజాత కార్యక్రమంలో గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దని కళాజాతలో ప్రజలకు కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. మండలంలో జి.మాడుగుల వారపు సంత, పెదలువ్వాసింగి, పరిసర గ్రామాల్లో గంజాయి నిర్మూలనపై కళాజాత రూపంలో ప్రదర్శించారు. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్‌, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రేకులు ఫెయిలై ఆటో బోల్తా



వైద్య సేవలందిస్తున్న గూడెం వైద్యులు



మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలిస్తున్న వైనం

- నలుగురి పరిస్థితి విషమం, కేజీహెచ్‌కు తరలింపు
- మరో ఆరుగురికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులంతా కాకినాడ జిల్లా దుమ్ములగెడ్డ వారే
- సాగుల ఘాట్‌ రోడ్డులో ప్రమాదం

గూడెంకొత్తవీధి: సాగుల ఘాట్‌ రోడ్డులో గురువారం బ్రేకులు ఫెయిలై ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో కాకినాడ జిల్లాకు చెందిన నలుగురికి తీవ్రంగానూ , మరో ఆరుగురికి స్వల్పంగానూ గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా దుమ్ములగెడ్డకు చెందిన 20 మంది క్రైస్తవ మత ప్రచారకులు మత ప్రచారం చేసేందుకు గూడెంకొత్తవీధి మండలం చీడిగొంది, లక్కవరం గ్రామాలకు రెండు ఆటోల్లో బయలు దేరారు. ఈ క్రమంలో సాగుల ఘాట్‌ రోడ్డులో పది మంది ప్రయాణికులతో వస్తున్న ఆటో బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో బోల్తా పడటంతో సర్జన్‌కుమార్‌ (50), తాతారావు(30), ఇజ్రాయిల్‌ (35), జోసఫ్‌ (30)లకు తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే 108 వాహనంలో గూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వినయ్‌కుమార్‌, అచ్యుత్‌ వెంటనే ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని కేజీహెచ్‌కు తరలించారు. మరో ఆరుగురు నూకరాజు, ఆనందరావు, శ్రీనివాస్‌, క్రాంతి, రమేష్‌, సాయిలకు గాయాలైనా వారి పరిస్థితి నిలకడగా ఉంది. వారికి స్థానిక ఆస్పత్రిలోనే వైద్య సేవలందించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌ సీపీ మండలాధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌ క్షతగాత్రులను పరామర్శించారు.

మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం

రాష్ట్ర కిల్కారి ప్రోగ్రాం మేనేజర్‌ లంకపల్లి రాజు



కిలగాడలో కిల్కారి ప్రోగ్రాంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది..

ముంచంగిపుట్టు: మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారి సేవలు అందిస్తున్నామని రాష్ట్ర కిల్కారి ప్రోగ్రాం మేనేజర్‌ లంకపల్లి రాజు అన్నారు. మండలంలోని కిలగాడ పీహెచ్‌సీలో కిలగాడ, రూడకోట, లబ్బూరు, గొమంగి పీహెచ్‌సీలకు చెందిన వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు కిల్కారి ప్రోగ్రాంపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకమైన దృష్టి సారించాయన్నారు. మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ కిల్కారి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు స్థానిక ఏఎన్‌ఎం వద్ద వివరాల నమోదులో ఇచ్చే ఫోన్‌ నంబరుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాయిస్‌ కాల్స్‌ వస్తాయన్నారు. ఆ కాల్స్‌లో వచ్చే వాయిస్‌ను వినడంతో ఆరోగ్య సూత్రాలు ఎంతో సులభంగా నేర్చుకోవచ్చన్నారు. మహిళ గర్భం దాల్చిన నాల్గో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్‌ కాల్స్‌ వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్‌ చేశామన్నారు. అనంతరం కిలగాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిల్కారి ప్రోగ్రాం రీజినల్‌ అధికారి ఎల్‌.మోహన్‌రావు, డీసీఎం మనోజ్‌కుమార్‌, డీపీహెచ్‌ఎన్‌ బోశకమ్మ, వైద్యాధికారులు రమేష్‌, శిరీష, ప్రతాప్‌, శ్యాంప్రసాద్‌, ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థుల హాల్‌ టికెట్లు పరిశీలించే విభాగం



అభ్యర్థుల డాక్యుమెంట్లు పరిశీలన విభాగం

ఆరిలోవ: స్టైపండరీ క్యాడెట్‌ ట్రైనీ ఎస్‌ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల కోసం విశాఖ రేంజ్‌ పోలీస్‌ ఉన్నతాధికారులు గురువారం ఏర్పాట్లు పూర్తి చేశారు. కైలాసగిరి ప్రాంతం ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌డ్‌ పోలీస్‌ మైదానం ఇందుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి సెప్టెంబర్‌ 23 వరకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. విశాఖ రేంజ్‌ పరిధి అటు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇటు గోదావరి జిల్లాల వరకు అభ్యర్థులకు ఇక్కడే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు రేంజ్‌ డీఐజీ ఎస్‌.హరికృష్ణ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షలో 17,374 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వారిలో 2,745 మంది మహిళా అభ్యర్థులున్నారు. వారంతా ఇప్పుడు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షకు అర్హత సాధించారు. మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్‌ 2 వరకు దేహదారుఢ్య పరీక్ష నిర్వహించనున్నారు. పోలీస్‌ అధికారులు వారికోసం కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల ఎత్తు, ఛాతి కొలతలతో పాటు లాంగ్‌ జంప్‌, హై జంప్‌, జావిలిన్‌ త్రో, డిస్కస్‌ త్రో, పరుగు పోటీలు తదితర పరీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో ఈవెంట్‌ కోసం వేర్వేరుగా టెంట్లు వేసి విభాగాలు ఏర్పాటు చేశారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద అభ్యర్థులు ఎటు వెళ్లాలో రూటు మ్యాప్‌తో పాటు రిక్రూట్‌మెంట్‌ బోర్డు అమర్చారు. ఏర్పాట్లును గురువారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులుతో కలిసి పర్యవేక్షించారు.

అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. ఎస్‌ఎల్‌పీఆర్‌ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు చేపట్టామన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో హాల్‌ టికెట్‌, కాల్‌ లెటర్‌, అప్లికేషన్‌, ఒరిజనల్‌ సర్టిఫికెట్లతో ఉదయం 5 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

అనకాపల్లి టౌన్‌ : ప్రస్తుత పరిస్థితుల్లో ఆశించిన వర్షపాతం నమోదు కానందున ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్‌ పీవీకే జగన్నాథరావు అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో ఖరీఫ్‌ సీజన్‌లో ఇప్పటి వరకు 435.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 357.8 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదైందని చెప్పారు. అంటే 181 శాతం తక్కువ నమోదైందని, ఆగస్టులో నేటి వరకు 137 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 62 శాతం తక్కువ అంటే 53 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. వారం, పది రోజుల్లో ఆశించిన మేర వర్షాలు నమోదు కాకుంటే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. జిల్లాలో వివిధ సాగు పద్ధతుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్త కేవీ రమణమూర్తి అధికారులకు అవగాహన కల్పించారు. అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, ఆత్మ పీడీ ఆశాదేవి, ఉద్యానశాఖ అధికారి ప్రభాకరరావు, శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, ముకుందరావు, విశాలాక్ష్మి, శ్రీదేవి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడికి పదేళ్ల జైలు

విశాఖ–లీగల్‌ : లారీలో గంజాయి తరలిస్తున్న వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విశాఖ మెట్రోపాలిటిన్‌ సెషన్స్‌ జడ్జి ఎస్‌.శ్రీదేవి గురువారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.1.50,000 జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఎ.వేణుగోపాలరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు సింగ్‌ ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రంలోని ఆమ్‌ రహో జిల్లాకు చెందినవాడు. వృత్తి రీత్యా లారీ డ్రైవర్‌. 2020 డిసెంబర్‌ 21న సాయంత్రం గాజువాక సమీపంలోని అగనంపూడి టోల్‌గేటు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. గాజువాక వెళుతున్న లారీలో 1,925 కిలోల గంజాయి కనుగొన్నారు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేశారు. లారీలోని గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్‌కు అప్పగించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

విస్తారంగా వర్షాలు..

- ఆనందంలో రైతులు
- మన్యంలో పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- పొలాల్లో చేరిన వర్షపు నీరు



వర్షంతో నిర్మానుష్యంగా మారిన పాడేరు పాతబస్టాండ్‌ అంబేడ్కర్‌ సెంటర్‌



జీకే వీధిలో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: అల్లూరి జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.ఖరీఫ్‌ వ్యవసాయానికి మేలు చేసే విధంగా మంచి సమయంలో వర్షాలు కురుస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి అనేక ప్రాంతాల్లో వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది.కొన్ని చోట్ల భారీ వర్షాలు కూడా కురిశాయి.జిల్లాలో 187.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.రంపచోడవరంలో 29, వీ.ఆర్‌.పురంలో 28.8, గంగవరంలో 24.2, దేవిపట్నంలో 19, అడ్డతీగలలో 12.6, ఎటపాకలో 16.8, కూనవరంలో 15.2, జి.మాడుగులలో 11.6, కొయ్యూరులో 10, జి.కే.వీధిలో 8.2, డుంబ్రిగుడలో 2.8, పెదబయలులో 2.6, అరకులోయలో 2.2, అనంతగిరిలో 1.4, ముంచంగిపుట్టులో 1.4, చింతపల్లిలో 1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కొయ్యూరు: మండలంలోని అనేక గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో కొన్ని చోట్ల వరినాట్లు వేస్తున్నారు. మెట్ట పంటలు వేసేందుకు వీలుగా రైతులు దుక్కులు చేస్తున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసరాల్లో గురువారం మధ్యాహ్నం దాదాపు మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పంట భూముల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. వరినాట్లు పూర్తయిన పంట భూములు కళకళలాడుతు కనిపించాయి. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా పిల్లకాలువలు పొంగి ప్రవహించాయి. మండలంలో దాదాపు 20 రోజులుగా వర్షాలు వెనుకడుగు వేశాయి. దీంతో మండలంలోని ప్రతి గ్రామంలో వరుణిని కోసం స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. ఒకే సారి భారీ వర్షం కురవడంతో తాము చేసిన పూజలు ఫలించాయని రైతాంగం ఊరడిల్లింది. మండలంలోని అప్పలరాజుపేట నుంచి వట్టిగెడ్డ వరకు గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌ పంట కాలువ గురువారం కురిసిన భారీ వర్షానికి తంటికొండ వద్ద కట్టలు తెంచుకొని ప్రవహించింది. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా పంటకాలువకు డైవర్షన్‌ ఇచ్చినప్పటికీ గట్లు తెగిపోవడం వల్ల వరద నీరు వట్టిగెడ్డ పొలాల్లోకి చొరబడుతోందని రైతులు చెబుతున్నారు. దీని వల్ల వరి ఆకుమడులు దెబ్బతిన్నాయని, కొన్ని చోట్ల మట్టి మేటలు వల్ల సాగు పనులకు ఆటకం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంభందిత రోడ్‌ నిర్మాణ పనులు చేపడుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లు పరిస్థితిని చక్కదిద్దాలని రైతులు కోరుతున్నారు.

స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట గల భారీ టేకు చెట్టుకు చెందిన కొంత భాగం (కొమ్మలు) నేలకు ఒరిగాయి. ఈదురు గాలుల వల్ల చెట్టు కొమ్మలు విద్యుత్‌ లైన్‌పై పడడంతో తీగలు తెగి సరఫరా నిలిచిపోయింది. దీనితో ట్రాన్స్‌కో సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని వైర్లు సరిచేసి విద్యుత్‌ సరఫరా పునరుద్ధరించారు. కాగా చెట్టు విరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని డ్వాక్రా మహిళలు ఊపిరి పీల్చుకొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు కుండపోత వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయ మయ్యాయి. వారపు సంత కావడంతో దుకాణాల యాజమానులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా ప్రధాన కాలువలు ఉప్పొంగి ప్రవహించాయి.